యూరియా లేదయా..! 6

● రైతులకు తప్పని ఆవేదన

● బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సిందే

● సరఫరా చేయాలని వినతి



ఉద్యోగాల భర్తీకి నో గ్యారెంటీ..!





● రెండేళ్లుగా చేపట్టని ప్రభుత్వ నియామకాలు ● నిరుద్యోగులకు తప్పని ఎదురు చూపులు

● వివిధ శాఖల్లో 2.76 లక్షల పోస్టులు ఖాళీ ● కుంటుపడుతున్న పాలన ● ఎస్సీ వర్గీకరణ ముగిసింది... మరి ప్రక్రియ ఎప్పుడో..?

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే వివిధశాఖలలో ఖాళీగా ఉండే పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతోంది. ఐదు గ్యారెంటీలకు ఏడాదికి రూ.56వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి నుంచి పార్టీ ఎమ్మెల్యే దాకా ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో ప్రస్తావిస్తున్నారు. ఐదు గ్యారెంటీల తరహాలోనే ఉద్యోగాలను భర్తీ చేస్తామని వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఉద్యోగాల భర్తీకి గ్యారెంటీ లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు ముగిసింది. అయినా ఏశాఖలోనూ ఉద్యోగాలు భర్తీ చేయలేదు. పైగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముగిసే దాకా నియామకాలు జరిపేది లేదని కొన్ని నెలలుగా వాయిదా వేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కానీ నియామకాలపై సంబంధించి పాలకులు ఎవరూ ప్రస్తావించడం లేదు.

ప్రతి శాఖలోనూ కాంట్రాక్టు నియామకాలే..

రాష్ట్రంలో 2.76 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాలనాయంత్రాంగానికి తిప్పలు తప్పడం లేదు. ప్రతిశాఖలోనూ కాంట్రాక్టు విధానం తీసుకొచ్చారు. ప్రత్యేకించి విద్యాశాఖలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేకపోతే అకడమిక్ కొనసాగే పరిస్థితి లేకుండాపోయింది. గత ప్రభుత్వంలో గెజిట్ జారీ చేసినా వాటికి అనుగుణంగా నియామక ప్రక్రియలను పూర్తి చేశారు. వాటిని మినహాయిస్తే రెండేళ్లుగా రాష్ట్రంలో ఏ శాఖలోనూ ప్రముఖంగా నియామకాలు జరగలేదు. ప్రభుత్వానికి కొండంత అండలా ఎస్సీ వర్గీకరణ అంశం ఉండేది. ఎప్పుడు నియామకాలకు సంబంధించిన అంశం ప్రస్తావనకు వచ్చినా వర్గీకరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అంతవరకు నియామకాలు జరపలేమని దాటవేసేవారు. రాష్ట్రంలో సరాసరిన ఏడాదికి 30వేలమంది ఉద్యోగులు రిటైర్డు అవుతారు. కొంతమంది మృతి



కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కార్యాలయం

చెందడం లేదా తప్పనిసరి రిటైర్మెంట్‌లో వెళతారు. ఇలా ఏటా ఖాళీ పోస్టులు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతానికి 2.76 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 2028 నాటికి ఈ సంఖ్య 3.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి నియామక ప్రక్రియ ప్రారంభించకుంటే రానున్న రోజుల్లో కొన్నిశాఖలలో తాలూకా స్థాయిలో ఒకే వ్యక్తి క్లర్క్ నుంచి అధికారి దాకా సేవలు అందించే పరిస్థితి కానుంది. ప్రముఖ శాఖలలో అధికారులకు ఇన్‌చార్జ్ పేరిట పదోన్నతులు కల్పిస్తున్నారు. వారు కీలకమైన పదవి వచ్చిందని ఆశ చూపుతున్నా రెండు-మూడు ఉద్యోగాలు చేయాల్సి వచ్చిందనేది మరిచిపోతున్నారు. కొన్ని కార్యాలయాలలో ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడి తట్టుకోలేక సెలవులపై వెళ్తున్నారు. కాలానికి అనుగుణంగా ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వ బాధ్యత, అయితే ఎస్సీ వర్గీకరణతోపాటు పలు కారణాలు చూపుతూ నియామకాలు జరపలేదు. రాజధాని బెంగళూరులో పనిచేసేందుకు ఉద్యోగులు ఆసక్తి చూపుతారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేందుకు పిల్లలకు సమగ్రమైన విద్య, కుటుంబీకులకు ఉన్నతమైన వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని వస్తున్నారు. ఏ పోస్టు అయినా సులభంగా వచ్చేందుకు సాధ్యమవుతోంది. కానీ మారుమూల జిల్లాలు బీదర్, రాయచూరు, యాదగిరి, కొప్పళ, బాగల్కోటె, కలబురగి వంటి ప్రాంతాలలో ఉద్యోగుల లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

విద్యా శాఖలోనే 70వేలు..

విద్యాశాఖలోనే అత్యధిక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక విద్యాశాఖలో 70,727 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ తర్వాత 37,069 పోస్టులు వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్నాయి. విద్య, వైద్యం కీలకశాఖలే కాక ఎక్కువమందికి ప్రయోజనం కలిగించే మహత్తరమైన విభాగాలు. అటువంటి రెండు శాఖలలోనే లక్షకు పైగా పోస్టులు ఖాళీగా ఉండడంతో రెండు విభాగాలలోనూ కాంట్రాక్టు ఉద్యోగుల ద్వారానే శాఖలు నడిపే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా అడ్మిషన్లు తగ్గిపోవడానికి ఇదే కారణమని విమర్శలూ వచ్చాయి

శాఖ పేరు	ఖాళీలు
విద్యాశాఖ	70,727
వైద్య ఆరోగ్యం	37,069
పాలనా వ్యవహారాలు	26,168
ఉన్నత విద్య	13,227
పశుసంవర్ధక	10,755
ఆర్థిక	9,536
రెవెన్యూ	11,145
గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్	10,898
అటవీశాఖ	6,337
బీసీ సంక్షేమం	8,334

వర్గీకరణ పేరుతో జాప్యం..

మూడు దశాబ్దాలకుపైగా ఎస్సీ వర్గీకరణకు పలు అడ్డంకులు వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో వర్గీకరణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక మంచి అస్త్రం లభించింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు వర్గీకరణ ప్రక్రియను ముగించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు జస్టిస్ నాగమోహన్‌దాస్ ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండు వారాలక్రిందటే కమిషన్ నివేదికను సమర్పించింది. ఇటీవలే శాసనసభలోనూ ఆమోదం లభించింది. పాలనను సులభతరం చేసేందుకు వివిధశాఖలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పాలనా సంస్కరణల కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వివిశాఖలలో పదోన్నతులు, నియమాకాలు అమలు చేయాలని కోరింది. అయితే వర్గీకరణ పూర్తి కావాలని వాయిదాలు వేశారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసనసభలోనూ ఆమోదం పలికింది. అయితే పలు కులాలు వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నాయి. ఈ వివాదంపై చర్చల ద్వారా పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ వారు కోర్టును ఆశ్రయిస్తే మొత్తానికే గండం పడినట్టు అవుతుంది. వర్గీకరణ నివేదికలో లోపదోషాలు కారణం చూపి రిజర్వేషన్ సాధ్యం కావడం లేదని, నియామకాలు మరింత జాప్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రక్రియ ప్రారంభం కోసం నిరుద్యోగులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

11 జిల్లాల్లో వెట్టిచాకిరీ

● సమగ్ర నిర్మూలనకు ప్రత్యేక అధికారుల నియామకం



బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వెట్టి చాకిరీ వేధింపులు శతాబ్దాలకాలంగా కొనసాగుతున్న అత్యంత నీచమైన విధానం. సమాజంలో వెట్టి చాకిరిని 48ఏళ్లక్రితమే సమగ్ర నిర్మూలనగా చట్టాన్ని రూపొందించారు. అయితే రాష్ట్రంలో ఇప్పటికీ వెట్టి చాకిరీ విధానం కొనసాగుతూనే ఉంది. ఏకంగా 11 జిల్లాల్లో వెట్టిచాకిరి ఉన్నట్లు పలు సందర్భాలు రుజువు చేస్తున్నాయి. వెట్టిచాకిరి వ్యవస్థ రాష్ట్రంలో ఇకపై కొనసాగరాదని 52మంది అధికారులను నియమించారు. వీరిని వెట్టిచాకిరీ నియంత్రణ అధికారులుగానే ప్రకటించారు.

బెంగళూరు నగరంతోపాటు చిక్కబళ్ళాపుర, హాసన్, మండ్య, మైసూరు, చిక్కమగళూరు, బెళగావి, బాగల్కోటె, రామనగర, కోలారు, తుమకూరు జిల్లాల్లో వెట్టిచాకిరీ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయం, మల్బరీ, బావుల తవ్వకం, చిన్నతరహా పరిశ్రమలు, జౌళి పరిశ్రమలు, హోటళ్లు, క్వారీలు, మాంసపు సంస్కరణ విభాగాలు, ఇటుకల బట్టీలలో వెట్టిచాకిరీ విధానంతో పనులు చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 2016 నుంచి 2024వరకు 2,631 వెట్టిచాకిరి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇదే వ్యవధిలోనే వెట్టిచాకిరి విముక్తులైన 4,397 మంది కార్మికులకు ప్రభుత్వం పింఛను ఇస్తోంది. ఈ పింఛను మొత్తాన్ని వెయ్యి రూపాయల నుంచి రూ.2వేలకు పెంచారు. కేంద్రప్రభుత్వం వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందినవారికి పునరావాసం కోసం పురుషులకు రూ.లక్ష, మహిళలు, చిన్నారులకు రూ.2లక్షలు, తీవ్ర వేధింపులకు గురైనవారికి రూ.3లక్షలు ఇస్తున్నారు. అయితే కోర్టు అంతిమతీర్పు ప్రకటించిన తర్వాతనే ప్రోత్సాహకం అందనుంది. రాష్ట్రంలో వెట్టిచాకిరిని సంపూర్ణంగా నిర్మూలిస్తామని సీఎం సిద్దరామయ్య 2024-25 బడ్జెట్‌లో ప్రకటించారు. ఈమేరకు 52మంది వెట్టిచాకిరీ నిర్మూలనా అధికారుల బృందాన్ని ప్రకటించారు. ఈ బృందంలో పోలీసులు, విద్యాశాఖ, కార్మిక, సాంఘిక సంక్షేమశాఖ, వ్యవసాయ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖతోపాటు వివిధశాఖల అధికారులు ఉంటారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు వివిధశాఖలు సమన్వయంతో పనిచేసేలా దశాబ్దాలక్రితమే మార్గదర్శకాలు చేశారు. 1976లో వెట్టిచాకిరీ నిర్మూలనా చట్టాన్ని అత్యంత పటిష్ఠంగా అమలు చేసేలా రూపొందించారు. అయినా ఇప్పటికీ ఈ విధానం కొనసాగడం విచారకరం. ఫాంహౌస్‌లకు, కాఫీ తోటలు, పల్లెలకు దూరంగా ఉండే పరిశ్రమల్లో కార్మికులను నియమించుకుంటారు. వారిచేత రాత్రింబవళ్లు పనులు చేయించుకుంటారు. ఏడాదికోసారి మాత్రమే జీతం నిర్ణయిస్తారు.

పలు రకాల ఆంక్షలు

సాధారణంగా కార్మిక చట్టానికి అనుగుణంగా వారానికి ఒకరోజు సెలవుతోపాటు కార్మికులకు ఆరోగ్యం, ఆహారం ఇతరత్రా సౌలభ్యాలు అందుబాటులో ఉండాలి. ఉదయం నుంచి సాయంత్రం దాకా పనిచేసినా వారు స్వతంత్రంగా జీవించేలా ఉండాలి. వారు పనిచేసే చోటు నుంచి బయటకు వెళ్లకుండా కట్టడి చేయడం, వారి అవసరాలను తీర్చకుండా నిర్బంధించడం, ఇంటిల్లిపాదీ పనిచేయాలనే షరతులు విధించడం వంటివి వెట్టిచాకిరీలో భాగంగా ఉంటాయి. తరచూ ఫాం హౌస్‌లు, ఇటుకల బట్టీలలో ఇటువంటి దుర్మార్గపు సంఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇకపై అటువంటివాటికి అడ్డుకట్ట పడనుంది.



బెంగళూరులో వినాయక విగ్రహాలను పరిశీలిస్తున్న మహిళ

వామ్మో.. లంబోధర..!

● అమాంతం పెరిగిన గణేశ్ విగ్రహాల ధరలు

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గణేశ్ విగ్రహాల ధరలు ఈ సారి బాగా పెరిగిపోయాయి. ఉత్సవాలకు మండపాలు సిద్ధం చేసుకున్న భక్తులు ప్రతిమల కొనుగోళ్లకు బెంగళూరు నగరానికి తరలివస్తున్నారు. అయితే ధరలను చూసి భాగా పెరిగిపోయాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయినా లెక్క చేయకుండా తమ శక్తి కొలదీ విగ్రహాలను కొని వాహనాల్లో తరలిస్తున్నారు. అయితే తయారీదారులు మాత్రం ముడి సరుకుల ధరలు పెరిగాయని, రంగులు, రవాణా ఖర్చులు అధికమయ్యాయని, అందుకే ధరలు పెంచక తప్పడం లేదని అంటున్నారు. రవాణాలో విగ్రహాలు దెబ్బ తింటున్నాయని, దీంతో కూడా నష్టాలు తప్పడం లేదంటున్నారు. అయినా ఆదివారం పలు ప్రాంతాల్లో విగ్రహాలు కొని వాహనాల్లో తరలించడం కనిపించింది.



గణేశ్ విగ్రహాలను తరలిస్తున్న యువకులు

చుక్కలు చూపిస్తున్న.. కుక్కలు..!



● బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు ● బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న బళ్లారి నగరవాసులు

బళ్లారి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. బళ్లారి నగరంలో ఎక్కడ చూసినా గుంపులు, గుంపులుగా తిరుగుతూ జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇటీవల కుక్కల దాడిలో తీవ్ర గాయాలు కావడం, ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. మహానగర పాలికె పరిధిలో రోడ్లపైనే కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. కౌల్‌బజార్, విద్యానగర్, కొలిమిబజార్, హుసేన్‌నగర్, రాఘవేంద్రకాలనీ, సత్యనారాయణపేట, మిల్లర్‌పేట, హవ్వంబావి, గాంధీనగర్, ఎంజీఏరియా, దత్తసాయినగర్, గుగ్గరహట్టి, అంద్రళ, ఏపీఎంసీ మార్కెట్, కణేకల్లు బస్టాండ్, బండీమోట, ఇలా అన్ని ఏరియాల్లో కుక్కల గుంపులు పెరిగిపోయాయి. రోడ్డు మధ్యలో ఉంటూ వాహనదారులపైకి దాడులు చేస్తున్నాయి. దీంతో వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. ఎవరైనా సరుకులు, ఆహార పదార్థాలు తీసుకెళ్తుంటే మీద పడి లాక్కుంటున్నాయి. వదలకపోతే కాటు వేసి గాయపరుస్తున్నాయని కౌల్‌బజార్‌కు చెందిన సత్తార్ సాబ్ అనే వ్యక్తి తన ఆవేదన వ్యక్తం చేశారు. వారం క్రితం మటన్ కవర్‌తో వస్తుంటే కుక్కలు వెంటపడి కవర్‌ను లాగుకున్నాయని వదలకపోతే కాటేశాయని వాపోయారు. గుగ్గరహట్టిలో ఇంటిముందు ఆడుతున్న పిల్లల పై కుక్కలు కాటేశాయని తల్లి వనజమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఏపీఎంపీ మార్కెట్‌లో లక్ష్మన్న అనే వ్యక్తిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పాలికె తరుపున కుక్కల సంతానం తగ్గించేందుకు ఇంజక్షన్లు వేస్తున్నారు. కుక్కలకు వారంలో రెండుసార్లు ఇంజక్షన్లు వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కుక్కల ఉత్పత్తి విపరీతంగా పెరగడం వీటికి తోడు మహానగర పాలికెలో ఉండే వీధుల్లో కుక్కల గుంపులు పెరుగుతుండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కౌల్‌బజార్‌లో యథేచ్ఛగా తిరుగుతున్న కుక్కల గుంపు



నిరసనలో పాల్గొన్న వచనానంద స్వామీజీ, ఎమ్మెల్యే విశ్వనాథ్

ధర్మస్థలపై రోజుకో.. కుట్ర

● విచారణలో వాస్తవాలు వెలుగులోకి..: వచనానంద స్వామీజీ ● ఫ్రీడం పార్కులో పలు సంఘాల నిరసన

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దర్మసల వివాదంలో వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని వచనానందస్వామీజీ అన్నారు. ఫ్రీడంపార్కులో దర్మసలకు మద్దతుగా ఆదివారం వివిధ ప్రజాసంఘాలు, స్వామీజీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వచనానందస్వామీజీ మాట్లాడుతూ సమాజంలో దశాబ్దాలకాలంగా లక్షలాదిమందికి సేవలందించి కోట్లాదిమంది ఆరాధ్యదైవంగా భావించే దర్మసలపై కుట్ర పన్నారన్నారు. ఒక్కొక్కటిగా వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ మాట్లాడుతూ దర్మసల వివాదంపై సిట్ ద్వారా కాకుండా ఎన్ఐఏ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కొందరు యూట్యూబర్లు పనిగట్టుకుని ధర్మస్థళకు చెడ్డపేరు తెచ్చారన్నారు. వారికి విదేశాలనుంచి నిధులు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎన్ఐఏ ద్వారా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు. దర్మసల అంశంలో నెలరోజులలోనే ఎన్నో మార్పులు చూశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అంశాలు తెలుస్తాయన్నారు.



నిరసనలో పాల్గొన్న ప్రజాసంఘాలు

సిట్ నివేదిక ఆధారంగానే చర్యలు

● ధర్మస్థల వ్యవహారంపై మంత్రి బోసరాజు



రాయచూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వ్యవహారానికి సంబంధించి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ బోసరాజు అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఎద్దేవా చేశారు. మతాలను భావోద్వేగాలను రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ధర్మస్థల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేయడాన్ని అక్కడి ధర్మాధికారి వీరేంద్ర హెగ్డె సహితం స్వాగతించిన అంశాన్ని బోసరాజు గుర్తు చేశారు. కాగా చిత్రదుర్గ ఎమ్మెల్యే వీరేశ్ అరెస్టుకు సంబంధించి ప్రభుత్వం చట్టపరంగానే చర్యలు తీసుకుంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరు వ్యవహరించినా తమ ప్రభుత్వం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వీరేశ్ పాటిల్ ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ గేమింగ్‌లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు వారి పై చర్యలు తీసుకున్నారని ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదన్నారు. అదే సందర్భంలో ధర్మస్థల వ్యవహారంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి కక్ష సాధింపు ధోరణి ఉండబోదని చట్టరమమైన చర్యలు మాత్రమే తప్పని సరిగా తీసుకుంటామన్నారు. చట్టం ముందు అందరు నేతలు సమానమేనని, అందులో పార్టీలకు సంబంధం లేదన్నారు.

ధర్మరక్షణ యాత్ర ప్రారంభం



ధర్మస్థలకు బయల్దేరుతున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్ళి (ఆంధ్రజ్యోతి): పవిత్రక్షేత్రం ధర్మస్థలకు దుష్ప్రచారం కొనసాగుతున్న తరుణంలో బొమ్మనహళ్ళి నియోజకవర్గం నుంచి ధర్మరక్షణ యాత్రకు శ్రీకారం చుట్టారు. ధర్మస్థళకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన ధర్మస్థలకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఒక వ్యక్తి ఫిర్యాదుతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని, సుమారు నెలరోజులపాటు చెడ్డపేరు సాగిందని విచారం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉండడం బాధాకరమన్నారు. హొంగసంద్రనుంచి బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, గోపినాథరెడ్డి, మాజీ కార్పొరేటర్ రామచంద్ర, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుమారు 2వేల వాహనాల్లో అభిమానులు కార్యకర్తలు బయల్దేరారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.42	1,625.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,29, 439	30,893
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,30, 038	8,658
నీటి నిల్వ (టీఎంసీలు)	74.61	78.80

యూరియా.. లేదయ్యా..!

● ఈ ఏడు రైతులకు తప్పని ఆవేదన ● యూరియా కొరతతో విలవిల ● బ్లాక్ మార్కెట్‌లో కొంటున్నామని ఆవేదన

బళ్లారి, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు విలవిలలాడుతున్నారు. తుంగభద్ర ఆయకట్టు సాగుతో పాటు ఇతర చెరువులు, బోర్ల కింద పంటలు సాగు చేస్తున్న రైతుకు యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నారు. వరి సాగుకు రైతులు ఎక్కువగా డీఏపీ, యూరియా లాంటి ఎరువులు ఉపయోగిస్తారు. వరి నాట్లు సమయంలో యూరియా దొరక్క అన్నదాత ఆవేదన చెందుతున్నారు. తుంగభద్ర జలాశయం కింద ఖరీఫ్‌లో 17 లక్షల ఎకరాల ఆయకట్టు భూమి సాగులో ఉంది. వీటితో పాటు చెరువులు, ఇతర జలాల ఆధారంగా రైతులు ఎక్కువగా వివిధ పంటలు సాగు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలతో రైతులకు ఎరువులు అందిస్తున్నారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరగడంతో యూరియా కొరత తీవ్రమయ్యింది. డిమాండ్‌కు తగ్గ యూరిగా సరఫరా కావడం లేదు. దీంతో వ్యాపారులు కూడా యూరియాను బ్లాక్‌లో అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాలో ఈసారి ఆయకట్టు కింద సాగు అధికంగా ఉంది. ఎక్కువగా వరి పైరు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు పంట నాటు వేసే ముందు, కలుపు తీసే ముందు యూరియా చల్లుతారు. ఎరువు పుష్కలంగా వాడితేనే దిగుబడి అధికంగా వస్తుందని రైతుల నమ్మకం. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని వ్యాపారులు బస్తాకు రూ. 150 అధికంగా విక్రయిస్తుందని రైతులు వాపోతున్నారు. పలు జిల్లాలో అధిక ధరలపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఎక్కువ ధరకు ఎరువులు విక్రమించే దుకాణదారులపై దాడులు చేసి సీజ్ చేశారు. అనేక సందర్భంలో రైతులు సంఘాలు నాయకులు కూడా ఎరువుల కొతర పై జిల్లా యంత్రాగంకు ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా యూరియా సరఫరా చేసి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వరి పొలంలో యూరియా చల్లుతున్న రైతు

శాంతిభద్రతలకు భంగం కలిగితే

కఠిన చర్యలు: డీఎస్పీ

రాయచూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఎలాంటి హింసాక సంఘటనలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సింధనూరు డీఎస్పీ తళవార్ హెచ్చరించారు. అదే సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీస్ యంత్రాంగం పూర్తి కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణల నేపథ్యంలో ఆదివారం సింధనూరు నగరంలోని పోలీస్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లతో సమావేశం నిర్వహించి వారికి హెచ్చరికలు చేశారు. సమావేశంలో మాట్లాడిన ఎస్‌ఐ సుజాతా నగరంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలని కోరారు. అదే సమయంలో ఎలాంటి అల్లర్లు జరిగినా శాంతి భద్రతలకు ఆటంకం కలుగుతున్నట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

యాడికి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని జయకృష్ణ (22) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని ఓబులాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బాలయంగన్న, సుశీల దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ ఎక్స్‌కవేటర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు జయకృష్ణ ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. నెల రోజుల క్రితం ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో వివాహమైంది. ప్రేమ విఫలమైందని జయకృష్ణ తరచూ బాధపడుతుండేవాడని, ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి మృతితో కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జయకృష్ణ (ఫైల్)

పిల్లలపై వేధింపులను అరికట్టాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ హ్యారీస్



మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ హారీస్

బళ్లారి సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పిల్లలపై హింసను నివారించడానికి వివిధశాఖలు కలిసి పనిచేయాలని పంచాయతీ ముఖ్యకార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారీస్ అన్నారు. బెంగళూరులోని బాలల రక్షణ డైరెక్టరేట్ జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, జిల్లా న్యాయ సేవల అధారిటీత మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా బాలల రక్షణ యూనిట్ బళ్లారి ఎన్ పోర్స్ ప్రొయాక్టివ్ హెల్త్ ట్రస్ట్ బెంగళూరు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. రక్షణ కోసం అనేక విభాగాలు భాగస్వాములుగా పనిచేస్తున్నాయన్నారు. జిల్లా బాలల రక్షణ విభాగం ప్రత్యేకరక్షణ విభాగం ప్రత్యేక బాలల పోలీసు విభాగం ప్రత్యేక బాలల పోలీసు విభాగం విద్యాశాఖ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించి ఆన్‌లైన్‌లోఏ అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆన్‌లైన్ పోలీస్ చంద్రకాంత్ నందారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ విజలక్ష్మిజిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ యల్లా రమేశ్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల అధిపతులు, వివిధ జిల్లాల నుండి 80మందికి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు మండపాలు సిద్ధం



విద్యుత్ దీపాల వెలుగులో ఓ వీధి

బళ్లారి సిటీ, 24(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలకు సర్వం సిద్ధమయ్యింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీధుల్లో గణేశ్ మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. నగరంలోని ఎంజీ సర్కిల్‌సమీపంలో గల 26 సంత్సరనాలుగా సర్వసిద్ధి వినాయక్ విత్ర మండలి గణేశ్ ఉత్సవాలను నగరంలోని నిర్వహిస్తున్నారు. ఈసంత్సరం కూడా చతుర్థిని జురుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అర కిలోమీటరు మేర విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగరంలోని పలు వీధుల్లో మండపాలను నిర్మించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

బత్తలపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసులు, డీసీడీఓ సురేష్‌కుమార్, ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యం లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ట్రే డర్స్, మోహన్ ట్రేడర్స్, మంజునాథ్ ట్రేడర్స్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు రికార్డులు పరిశీలించారు. పలు రికార్డులపై ఆరా తీసి విచారణ చేపట్టారు.



గోతులమయమైన కేసీ రోడ్డు

వామ్మో.. కేసీ రోడ్డు..!

● గుంతల రహదారిలో ప్రయాణమంటే బెంబేలెత్తుతున్న వాహనదారులు

బళ్లారి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేసీ రోడ్డు బళ్లారి నగరంలో ప్రధాన రహదారి. ఈ దారిలో నిత్యం స్థానికులతో పాటు అనేక ప్రాంతాల నుంచి జనం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బెంగళూరు రోడ్డు నుంచి రాఘవేంద్ర టాకీస్ వరకూ కలిపి ఈ రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. బెంగళూరు రోడ్డు నుంచి కేసీ రోడ్డులోకి ఎంటర్ అయ్యే టర్నింగ్ లో రోడ్డు మూరెడు లోతు గుంతలు పడ్డాయి. వీటికి తోడు అక్కడ డ్రైనేజీ కూడా ఉంది. ఇక వానకాలం వచ్చినా, చిన్నపాటి చినుకులకు కురిసినా రోడ్డులో నీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. సుమారు 500 మీటర్లు పొడవున్న ఈ రోడ్డును దాటాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యసవర పరిస్థితుల్లో ఈ రోడ్డు మీద ప్రయాణం అంటేనే జంకాల్సిన పరిస్థితి దాపురించింది. ఎరువుల దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులు తదితర వారికి కూడా ఇబ్బందిగానే మారింది. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు: సీఐ



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రుద్రప్ప

బళ్లారి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని, గొడవలకు పాల్పడిదే చర్యలు తప్పవని సీఐ రుద్రప్ప హెచ్చరించారు. ఆదివారం పీడీహళ్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి, ఈద్ మిలాద్ నబి పండుగల సందర్భంగా శాంతి సభను నిర్వహించారు. సమావేశానికి సీఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఉన్న 18 గ్రామాల యువకులు, ప్రముఖులు హాజరయారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేశ్ విగ్రహాలను నిర్దీత ప్రదేశాల్లో కూర్చోబెట్టాలని, డీజేల ఏర్పాటు, టపాసులు, కాల్చరాదని తెలిపారు. గ్రామపంచాయతీ అనుమతులతో పాటు పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఈద్‌మిలాద్ సమయంలో ప్రార్థనా స్థలంలో శబ్దాలు చేయరాదన్నారు. యువకులు శాంతియుతంగా పండుగలు జరిగేందుకు సహకరించాలని కోరారు. వీరితో పాటు ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐలు దుర్గాప్రసాద్, వేణుగోపాల్, ప్రభాకరరెడ్డి, మంజునాథ్, అన్నమేష్, కుమారస్వామి, రేవన్న సిద్ధప్ప, పలుగ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బళ్లారి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వర నగర్‌లో వెలసిన అభయాంజనేయస్వామికి ఆమావాస్య సందర్భంగా తులసీ దళంతో ప్రత్యేక అలంకరణ, పల్లకి సేవ, ప్రత్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

తెనగల్లు.. టీచర్లకు పుట్టినిల్లు..!

● ఒకే గ్రామంలో 9 మందికి కొలువులు ● అందరూ పేద కుటుంబాలకు చెందిన వారే.. ● ఇప్పటిదాకా 40 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక



ఎస్. లక్ష్మణమూర్తి



జె. జ్యోతి



కె. శ్రీకాంత్



బండి తేజ



యశ్వినీ భాను



పి. నీలకంఠేశ్వరప్ప



హరీష్



గంగాధర



కె.సురేశ్ బాబు



చంద్రశేఖర్

కుందుర్పి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం పేరుచెబితేనే ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తుకు వస్తాయి. ఉపాధ్యాయ పోస్టులకయితే అది పుట్టినిల్లుగా మారింది. కుందుర్పి మండలంలోని తెనగల్లు గ్రామానికి చెందిన నిరుద్యోగులు డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో తెనగల్లుకు చెందిన 9 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఆ గ్రామంలో టీచర్ పోస్టులకు ఎంపికయిన వారు 40 మంది దాకా ఉన్నారు. అందరూ మధ్య తరగతి, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు చెందిన వారే. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 9 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. జిల్లా స్థాయిలో.. ఎస్. లక్ష్మణమూర్తి ఎస్ఏ ఫిజిక్స్‌లో 57.57 మార్కులతో 282వ ర్యాంక్, జె. జ్యోతి ఎస్‌జీటీ 85.95 మార్కులతో 54వ ర్యాంక్, కె. శ్రీకాంత్ ఎస్‌జీటీ 84.51 మార్కులతో 86వ ర్యాంక్, బండి తేజ ఎస్‌జీటీ 88.88 మార్కులతో 23వ ర్యాంక్, యశ్వినీ భాను ఎస్ఏ బయాలజీ 78.44 మార్కులతో 31వ ర్యాంక్, పి.నీలకంఠేశ్వరప్ప ఎస్ఏ సోషల్ 76.45 మార్కులతో 51వ ర్యాంక్, హరీష్ ఎస్ఏ పీఈటీ 76.5 మార్కులతో 85వ ర్యాంక్, గంగాధర ఎస్ఏ సోషల్ 73.04 మార్కులతో 92వ ర్యాంక్, కె. సురేశ్‌బాబు ఎస్ఏ పీడీ 92 మార్కులతో 2వ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా మండల పరిధిలోని కరిగానిపల్లికి చెందిన చంద్రశేఖర్ ఎస్ఏ తెలుగు 76.47 మార్కులతో 33వ ర్యాంక్ సాధించారు. ఇతడే పీజీటీ జిల్లా స్థాయిలో 68.60 మార్కులతో 201వ ర్యాంక్ సాధించారు. రెండు ఉద్యోగాలకు అర్హత సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయినప్పటికీ ఆత్మస్థైర్యంతో కష్టపడి చదివి విజయం సాధించారు.

ఒకరికే...మూడు ఉద్యోగాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న ముత్యాలప్ప మొదటి కుమార్తె ఆర్. సాయి చందన ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. టీజీటీ బయాలజీ జోన్-4లో 81.79 మార్కులతో 5వ ర్యాంక్, అనంతపురం జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 83.13 మార్కులతో 8వ ర్యాంక్, ఎస్‌జీటీలో 84.54 మార్కులతో 84వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించినట్లు ఆమె తెలిపారు.



సాయి చందన

మద్దకవారిపల్లిలో నలుగురికి..



ఎం. విష్ణువర్ధన్



ఎ.చంద్రకళ



బి. వెంకటరమణ



సి.గీతాంజలి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామంలో నలుగురికి ఉపాధ్యాయ పోస్టులు రాగా.. వారిలో ఒకరు ఏకంగా నాలుగు పోస్టులకు ఎంపికయ్యారు. మండలంలోని తంగేడుకుంట పంచాయతీ మద్దకవారిపల్లిలో డీఎస్సీ పరీక్షల్లో నలుగురు ఉపాధ్యాయ పోస్టులను దక్కించుకున్నారు. మద్దక విష్ణువర్ధన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు 78.5 మార్కులతో 24వ ర్యాంకు, టీజీటీ ఇంగ్లీషులో 75 మార్కులతో 70వ ర్యాంకు, సోషియల్ 72.16 మార్కులతో 62వ ర్యాంకు, ఎస్‌జీటీ తెలుగు 86.2 మార్కులతో 161వ ర్యాంకు, చంద్రకళ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ స్సైన్సులో 82.53 మార్కులతో 4వ ర్యాంకు, టీజీటీ సైన్సులో 67.5 మార్కులతో 40వ ర్యాంకు, జె. వెంకటరమణ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో 77.34 మార్కులతో 37వ ర్యాంకు, ఎం. గీతాంజలి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో 75.5 మార్కులతో 101వ ర్యాంకు సాధించి, ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వీరితోపాటు ఇదే పంచాయతీలోని బుచ్చిరాజుపల్లికి చెందిన ఎ. సోముశేఖర్ టీజీటీ సోషియల్‌లో, తంగేడుకుంట హర్షియాభాను ఎస్జీటీ పోస్టులు సాధించారు.

పీఈటీ మొదటి ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం



ఉమామహేశ్‌ను సన్మానించి, జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించిన ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. అనంతరం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేయడంతో ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి తమ కలను నెరవేర్చుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ ఇచ్చి ఎంతో మంది నిరుద్యోగులకు బాసటగా నిలవడంతో వారు ఉద్యోగాలు సాధించారని కొనియాడారు.

అత్త ప్రోత్సాహంతో మూడో ర్యాంకు



గంజి రాశి

కూడేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీచర్ కావాలన్న లక్ష్యంతో నిరంతరం శ్రమించిన గంజి రాశికి అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారం తోడవడంతో డీఎస్సీ ఎస్జీటీ పోస్టుల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించారు. కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన గంజి రాశి చదువుల్లో బాగా రాణిస్తుండటంతో కుటుంబ సభ్యులు ప్రోత్సాహం దక్కింది. గ్రామంలో సెంటు భూమిలేని ఆ నిరుపేద కుటుంబానికి చదువుల తల్లే దిక్కయింది. డీఎస్సీ-2018లో 72.63 కటాఫ్ మార్కులు కాగా.. గంజిరాశికి 72.53 రావడంతో కేవలం 0.10 అతి తక్కువ మార్కులతో ఉద్యోగం చేజారింది. దీంతో ఏడాది క్రితం అనంతపురంలో అద్దె ఇంట్లో ఉంటూ.. ఏడాది క్రితం పుట్టిన చంటి బిడ్డను అత్త వద్దనే వదిలి సాయిగంగ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. టెట్ పరీక్షలో 150 మార్కులకు 149.56 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో 100 మార్కులకు గంజి రాశికి 92.46 మార్కులు రావడంతో జిల్లాలో మూడో ర్యాంక్ సాధించి ఎస్జీటీ పోస్టు దక్కించుకుంది. దీంతో ఉద్యోగం సాధించిన కోడలికి అత్త నీలమ్మ స్వీట్ తినిపించింది. అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారంతోనే తాను టీచర్ పోస్టు సాధించానని ఆమె తెలిపారు. ఆమె భర్త మధు ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

తోపుడుబండి వ్యాపారి కూతురికి రెండు ఉద్యోగాలు



పార్వతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తోపుడుబండి వ్యాపారి కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపికయింది. నగరంలోని పాతూరులో నివాసముంటున్న తోపుడుబండి వ్యాపారులు శ్రీనివాసులు, మంగాదేవిలకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురుని చదవించకోలేక వివాహం చేశారు. రెండోకూతురు పార్వతిని తోపుడుబండి వ్యాపారం చేస్తూనే డిగ్రీ, డీఈడీ చదివించారు. పార్వతి కష్టపడి చదివి గత నెలలో విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉద్యోగానికి ఎంపికయింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లోనూ 83.28 మార్కులు సాధించి ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయింది. టెట్‌లోనూ 150 మార్కులకు గాను 139 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని పార్వతి తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైనా...ఎస్జీటీగా వెళ్తానని అన్నారు. తమ కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



తోపుడుబండితో పార్వతి తల్లిదండ్రులు

హోసూరు జోన్



మొక్కలు నాటుతున్న మేయర్ సత్య

పచ్చదనం పెంపే లక్ష్యం: మేయర్

హోసూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య అభిప్రాయపడ్డారు. డెంకణీకోట రోడ్డులోని ప్రభుత్వ శిక్షణాకేంద్రంలో ఐటీఐ విద్యార్థి హాస్టల్ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చెన్నీరప్ప, రవికుమార్, మనోకరన్, దయాళన్, సంపత్, శ్రీనివాసన్, స్వచ్ఛందసంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర పరీక్షా శిబిరం

హోసూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టైటాన్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్ లిమిటెడ్ (టీల్) హోసూరు ఎవరెస్ట్ అరిమా సంఘం, కృష్ణగిరి జిల్లా దృష్టిహీన నివారణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం ఆదివారం నిర్వహించారు. కోయంబత్తూరు అరవింద్ కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ జయకుమార్ నేతృత్వంలోని సిబ్బంది పరీక్షలు చేశారు. శిబిరంలో 185మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 48మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి పంపారు. టీల్ సంస్థ సామాజిక సేవలో భాగంగా శిబిరం ఏర్పాటుకు సహకారం అందించిందని నిర్వాహకులు తెలిపారు. అరిమాసంఘం నాయకుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.




శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చట్టాంపి స్వామిగల్ (జయంతి)



సన్యాసిగా అయినప్పటికీ సంఘసంస్కర్తగా గుర్తింపు పొందిన చట్టాంపి స్వామిగల్ 1853 ఆగస్టు 25న కేరళ రాష్ట్రం త్రివేంద్రంలోని కొల్లూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు అయ్యప్పన్ పిళ్ళై. హిందూ ధర్మ ఉద్దరణకోసం పాటుపడ్డారు. ప్రత్యేకించి అద్వైత వేదాంతంలో రాణించారు. ఆధ్యాత్మిక బోధనలతో ఆకట్టుకున్నారు. భజనలు, వ్యాసాలు, చరిత్ర, భాష, ఆధ్యాత్మికంపై ఎన్నో రచనలు చేశారు. శాకాహారం, అహింస విధానాలు ఆచరించి ప్రోత్సహించారు. ఆయన రచనల్లో 'వేదాదికార నిరూపణం' ఎంతో పేరొందింది. కొన్ని రచనలు మరణించిన 8 దశాబ్దాల అనంతరం ప్రచురితం కావడం విశేషం. 1924 మే 5న కన్నుమూశారు.

కిరుపానంద వారియర్ (జయంతి)



తిరుమురుగ కిరుపానంద వారియర్ 1906 ఆగస్టు 25న తమిళనాడు రాష్ట్రం వేలూరులో జన్మించారు. ఆధ్యాత్మికవేత్తగా, ఉపాధ్యాయుడిగా పేరొందారు. 64వ నాయనార్‌గా పరిగణిస్తారు. మురుగన్ భక్తుడిగా రాష్ట్ర వ్యాప్తం గా పలు ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేశారు. 'ఇసై పెరారిగ్నర్' అనే బిరుదు పొందారు. కళైమామణి, ప్రవచన సామ్రాట్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1993 నవంబరు 7న కన్నుమూశారు. 2006లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

దేవులపల్లి రామానుజరావు (జయంతి)



ఆంధ్ర సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ నిర్మాతగా పేరొందిన డాక్టర్ దేవులపల్లి రామానుజరావు 1917 ఆగస్టు 25న వరంగల్లు పట్టణ సమీపాన దేశాయిపేట ప్రాంతంలో జన్మించారు. పాత్రికేయుడిగా, సంపాదకులుగా రాణించారు. తెలంగాణ విముక్తి పోరాటంలో అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన సాహితీకారుడు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషా ప్రవీణుడు. వక్త, పరిశోధకుడు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. 1950 నుంచి 1979 వరకు ఉస్మానియా యూనివర్శిటీ సెనేట్, సిండికేట్ సభ్యుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి. 1993 జూన్ 8న కన్నుమూశారు.

సీన్ కానెరి (జయంతి)



జేమ్స్‌బాండ్ పాత్రతో గుర్తింపు పొందిన సర్ థామస్ సీన్ కానెరి 1930 ఆగస్టు 25న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. స్కాటిష్ యాక్టర్‌గా, నిర్మాతగా రాణించారు. అకాడమీ అవార్డు, 2 బాఫ్టా అవార్డులు, 3 గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాలు అందుకున్నారు. 'ది గ్రేటెస్ట్ లివింగ్ స్కాట్, స్కాట్లాండ్స్ గ్రేటెస్ట్ లివింగ్ నేషనల్ ట్రెజర్ పురస్కారాలు అందుకున్నారు. 90వ యేట 2020 అక్టోబరు 31న కన్నుమూశారు.

వినేశ్ ఫోగట్ (పుట్టినరోజు)



వినేశ్ ఫోగట్ 1994 ఆగస్టు 25న హర్యానా రాష్ట్రంలో జన్మించారు. మహిళల్లో రెజ్లర్‌గా తనదైన గుర్తింపు పొందారు. కామన్వెల్త్‌లోనూ, ఏషియన్ గేమ్స్‌లోనూ బంగారుపతకం సాధించిన తొలి మహిళా రెజ్లర్. 2019లో 53 కిలోల విభాగంలో వరల్డ్ చాంపియన్ మెడల్ అందుకున్నారు. వేర్వేరు సంవత్సరాల్లో 48, 50, 53 కిలోల విభాగాల్లో ఆమె పాల్గొని ఒలింపిక్స్ గేమ్స్‌లో తనదైన రికార్డు నెలకొల్పారు. 2016లో అర్జున అవార్డు, తాజాగా 2020 ఆగస్టులో రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2021 పోలెండ్ ఓపెన్‌లోనూ, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గోల్డ్‌మెడల్ సాధించారు. 2024లో క్రీడలకు రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం హర్యానా రాష్ట్రం జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

బాక్సింగ్‌లో రాణించిన శ్రీకృష్ణ విద్యార్థి



విజేత స్రవంత్

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో శ్రీకృష్ణ ఇంటర్నేషనల్ విద్యార్థి స్రవంత్ రాణించారు. డెక్లథాన్ సంస్థ శని, ఆదివారాలలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించింది. రీజనల్ టోర్నీలో పదో తరగతి చదువుతున్న స్రవంత్ రాణించి నెంబరువన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈమేరకు విద్యాసంస్థ చైర్మన్ ఎం రుక్మాంగదనాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

తనకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌లో కొంతమంది యువత రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకుని సత్యన్నసేనను ఏర్పాటు చేశారు. ఈ పేరుతో 38 నెలలుగా నిరుపేదలైన గర్భిణులకు ప్రతినెలా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఆదివారం ఆరుగురు నిరుపేదలకు అందించారు.

సాంకేతిక విధానాలను విద్యార్థులు అలవరుచుకోవాలి

» బీటెక్ తరగతుల ప్రారంభోత్సవంలో పీఈఎస్ చాన్సలర్ జవహర్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతటా సాంకేతిక విప్లవం దశలో ఉందని విద్యార్థులు టెక్నాలజీలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అలవరుచుకోవాలని పీఈఎస్ యూనివర్సిటీ చాన్సలర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. ఆదివారం యూనివర్సిటీ ప్రాంగణంలో బీటెక్, ఆర్కిటెక్చర్ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ నిర్వహించారు. పీఈఎస్ గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యతను సాధించాలని సూచించారు. సీఓఓ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర కఠిన పరిశ్రమ, ఏఐ, గూగుల్‌ను అవలంబించేముందు ప్రాథమిక అంశాలను సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. మెంటార్ విధానంతో ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేకశ్రద్ధ కొనసాగిస్తామన్నా వైస్‌చాన్సలర్ డాక్టర్ జే సూర్యప్రసాద్ మాట్లాడుతూ కొత్త విద్యార్థులకు స్వాగతంతోపాటు ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించేలా వ్యవస్థాపకులు డాక్టర్ ఎంఆర్ దొరస్వామి మార్గదర్శకాలను కొన సాగిస్తామన్నారు. ఇప్పటివరకు 100 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలను సీఎన్ఆర్ రావ్, ప్రొఫెసర్ ఎంఆర్‌డీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందించామన్నారు. రిజిస్ట్రార్ శ్రీధర్‌తోపాటు వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణకు బైక్ ర్యాలీ



పచ్చజెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

మహదేవపుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని రక్షించాలనే నినాదంతో నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్ నెక్సస్ మాల్‌నుంచి మండూరు గ్రామం వరకు సేవ్ ఎర్త్ రైడ్ పేరిట బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ చైర్మన్ అరవింద లింబావళి మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా అరవింద లింబావళి మాట్లాడుతూ పచ్చదనం పెంపుకోసం గత 8 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహదేవపురలో వర్షపునీటి కోసం కాలువను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. పలు మౌలిక సదుపాయాలు కూడా అభివృద్ధి చేశామన్నారు. మహదేవపుర టాస్క్‌ఫోర్స్ మొత్తం 9 బృందాలు ఉన్నాయన్నారు. జలశక్తి, పరిసర టాస్క్‌ఫోర్స్, సీఎస్ఆర్, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా పలు చెరువులను అభివృద్ధి చేశామన్నారు. ఈ సందర్భంగా బైకింగ్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా ముఖ్యులు ఆశిష్‌సింగ్, హరాడి పిళ్ళప్ప, ప్రముఖులు ఎల్ రాజేశ్, నటరాజ్, శ్రీధర్, కెంపేగౌడ, జనార్ధనగౌడ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో సహకార సొసైటీ



సీనియర్ షేర్‌హోల్డర్లకు సన్మానం

విజయపుర, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమృద్ధి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ రూ.24.5 లక్షల రూపాయల లాభంతో కొనసాగుతోందని సొసైటీ అధ్యక్షుడు ఎన్ రుద్రమూర్తి తెలిపారు. పట్టణంలోని నగరేశ్వరస్వామి ప్రార్ధనామందిరంలో 2024-25 వార్షిక సొసైటీ సర్వసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లక్రితం 11లక్షలతో ప్రారంభమైన కో-ఆపరేటివ్ సొసైటీ ప్రస్తుతం రూ.3కోట్ల లావాదేవీలకు చేరుకుందన్నారు. సొసైటీ ముఖ్య కార్యనిర్వాహకులు ఎస్ విమలా మాట్లాడుతూ సొసైటీ షేర్‌హోల్డర్ల పిల్లలు ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలో 85శాతంకంటే ఎక్కువమార్కులు సాధించినవారికి ప్రతిభా పురస్కారాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నుంచి షేర్‌హోల్డర్లలో సీనియర్లను సన్మానిస్తున్నట్టు తెలిపారు. 2024-25 వార్షిక లాభం (డివిడెండ్) 10శాతాన్ని అందచేశామన్నారు. ఇదే సందర్భంగా 2025-26 వార్షిక అంచనాఖర్చు పట్టిని అమోదించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్‌లు, పదాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



పతకాలను చూపుతున్న వివిధ విభాగాల విజేతలు

దొమ్మసంద్ర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలోని చౌడేశ్వరి కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం జరిగాయి. మంజు తైక్వాండో అధ్యక్షత వహించారు. సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయి న్యాయనిర్ణేతగా పేరొందిన నారాయణస్వామి పాల్గొని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు తైక్వాండో దోహదపడుతుందన్నారు. కేవలం ఆత్మరక్షణకే కాక శారీర ధృడత్వానికి సహకరిస్తుందన్నారు. 26 సంవత్సరాలుగా తైక్వాండో నేర్పిస్తున్నానన్నారు. ఆరేళ్లలో దొమ్మసంద్ర గ్రామానికి చెందిన పదిమంది తన వద్ద నేర్చుకున్నారన్నారు. ప్రస్తుతం తనవద్ద శిక్షణ పొందిన విద్యార్థులు వేర్వేరు ప్రాంతాలలో తమ ప్రతిభతో రాణిస్తున్నారన్నారు. పోటీలలో 26 కేంద్రాలకు చెందిన కోచ్‌లు పాల్గొన్నారు.

కైవార తాతయ్య సిద్ధాంతాలు పాటించాలి

» ముదిమడుగు సహపంక్తిలో అరివు శివప్ప



సమావేశంలో ప్రసంగిస్తున్న శివప్ప

శ్రీనివాసపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అరివు భారత సంస్థ ద్వారా సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఈ ప్రాంతానికి చెందిన కైవార నారేయణ తాతయ్య అనుభవాలు వెలకట్టలేనివని సంస్థ వ్యవస్థాపకులు శివప్ప అభిప్రాయపడ్డారు. శ్రీనివాసపురం తాలూకా ముదిమడుగు గ్రామంలో అరివు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తత్వపదాల గాయనం, సహపంక్తి భోజనం నిర్వహించారు. గ్రామస్థులంతా పండుగ వాతావరణం తరహాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్ప మాట్లాడుతూ సమాజంలో సమగ్రత, సమానత్వం అనేది కైవార తాత తత్వాల ద్వారా చాటారన్నారు. కుల వ్యవస్థ తొలగాలి, అందరూ మనుష్యులే అని భావించాలని తాతయ్య తెలిపారన్నారు. కైవార తాతయ్యను పొగుడతాము కానీ ఆయన సిద్ధాంతాలను పాటించడం లేదన్నారు. కష్టమైనా నేటి సమాజానికి తాతయ్య సిద్ధాంతాలు అవసరమన్నారు. 11 సంవత్సరాలుగా మనుష్యులంతా ఒక్కటే, కులమతబేధాలు ఉండరాదనే కార్యక్రమాలను అరివు సంస్థ ద్వారా అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 28 తత్వపద బృందాలు గేయాలాపనలతో ప్రత్యేక ఆకర్షణ అయ్యాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, స్థానికులు జయరాం, కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న రుత్వికుల బృందం

బొమ్మనహళ్ళి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం శ్రావణమాసంలో చివరి శనివారం రోజున లక్ష్మీశ్రీనివాస కల్యాణోత్సవం హెచ్ఎస్ఆర్ లే అవుట్ వాజ్‌పేయ్ క్రీడామైదానంలో వైభవంగా జరిగింది. శ్రీలక్ష్మీవేంకటేశ్వర కల్యాణ నిర్వహణా సమితి 16సంవత్సరాలుగా ఏటా ఉత్సవం ఆచరిస్తోంది. తిరుమల తరహాలో 18మంది రుత్విక్కుల వేదమంత్రోచ్చారణ నడుమ మూడు గంటలపాటు కల్యాణోత్సవం సాగింది. సుమారు 2,500మందికిపైగా భక్తులు పాల్గొని తిలకించి పునీతులయ్యారు. కల్యాణోత్సవం అనంతరం శ్రీవారి లడ్డూ, అక్షింతలు భక్తులకు అందచేశారు. అన్నదానం నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కుపేంద్రరెడ్డి, మాజీ ఎంపీ ఉగ్రప్ప, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, గ్యారెంటీ పథకాల కమిటీ తాలూకా అధ్యక్షుడు వాసుదేవరెడ్డితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తబృందం

సంబరంగా కృష్ణాష్టమి



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బాగేపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకుని నందగోకుల యాదవసంఘం ఆధ్వర్యంలో పట్టణంలో వేడుకలు సాగాయి. ఇందిరా క్యాంటీన్ సమీపాన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా కొలువుదీర్చి పూజలు చేశారు. అలంకరించిన వాహనంపై శ్రీకృష్ణుడిని ఆదివారం ఊరేగించారు. వారం పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శ్రీకృష్ణుడి గీతో పదేశం, ప్రవచనాల, భజన కార్యక్రమాలు సాగాయి. పట్టణం, తాలూకాలోని గ్రామాలతో పాటు సమీపంలోని గోరంట్ల, ధర్మవరం ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. డీవీజీ రోడ్డు పొడవునా సందడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళా బృందాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవంలో సంఘం తాలూకా అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రవి, ప్రధాన కార్యదర్శి బాలరెడ్డి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనకు వాకథాన్



విధానసౌధ వద్ద వాకథాన్ బృందం

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో క్యాన్సర్ వ్యాధి ప్రబలుతోందని ప్రజలకు అవగాహన కల్పించేందుకు హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం 5కే వాకథాన్ నిర్వహించారు. ఓ విధమైన క్యాన్సర్ ప్రభావం ఉన్న సార్కోమాపై నగర ప్రజలలో అవగాహన పెంచేందుకు వాకథాన్ కొనసాగించారు. కబ్బన్‌పార్క్, చిన్నస్వామిస్టేడియం, విధానసౌధ, కేఆర్ సర్కిల్ మీదుగా హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ వద్ద వాకథాన్ ముగిసింది. హెచ్‌సీజీ రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మనీశ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని వివిధ వర్గాల క్లబ్‌లు, ఆరోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామీజీతో మాజీ ఎంపీ, భక్తబృందం

బంగారపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మాగొందిగేట్ సమీపాన శివశనేశ్వర దేవాలయ ఐదో వార్షిక మహోత్సవం శనివారం భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈశ్వరుడు, శనైశ్చరుడు, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి, అయ్యప్పస్వామి, ఓంశక్తి, నవగ్రహ దేవతలకు విశేషపూజలు, అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త మునేశ్వరస్వామిజీ మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ ఎస్ మునిస్వామి మాట్లాడుతూ భక్తులు ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఆలయం మరింత పురోగతి సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆలయానికి విచ్చేస్తున్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగుతోందన్నారు. వార్షికోత్సవంలో భాగంగా బులెట్ నాగరాజ్ నేతృత్వంలో 'శని ప్రభావం లేదా రాజ విక్రమ' అనే కన్నడ పౌరాణి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పురసభ సభ్యులు కపాలి శంకర్, స్థానిక ప్రముఖులు హోసరాయప్ప, చంద్రప్ప, పిళ్ళప్పగౌడ, మేస్త్రి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరుడి కల్యాణోత్సవం



స్వామివారికి విశేష అలంకరణ

ముళబాగిలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కాంతరాజ్ సర్కిల్ సమీపాన గల పురాణ ప్రసిద్ధ జ్యేష్ఠాదేవి సమేత శనైశ్చరస్వామి కల్యాణోత్సవం, బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు సీ శ్రీనివాసాచారి నేతృత్వంలో పూజలు సాగాయి. భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శనిప్రభావం అనే కన్నడ హరికథ భక్తులను ఆకట్టుకుంది.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు



చెరువులో గుంతను తవ్వుతున్న దృశ్యం

చింతామణి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో బెంగళూరు మెయిన్‌రోడ్డుకు అనుబంధంగా కన్నంపల్లి సమీపాన ఓటికెరెలో గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈసారి వర్షంకొరత కారణంగా నగర సభ ఆధ్వర్యంలో చెరువులో ఒక గుంతను తవ్వి అందులో నీటిని తట్వేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం పొక్లైనర్‌తో గుంతను తవ్వేపనులు పూర్తయ్యాయి. నగరసభ అధికారులు గుంతను తవ్వేపనులను పర్యవేక్షించారు. ట్యాంకరు ద్వారా నీటిని గుంతలో చేర్చేలా ప్రయత్నాలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గుంత చుట్టూ కంచె ఏర్పాటు చేయదలిచినట్టు నగరసభ కమిషనర్ చలపతి తెలిపారు.

హాకథాన్ విజేత ఆర్‌వీ కళాశాల జట్టు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నేషనల్ కళాశాలలో జరిగిన ఇంపోర్ట్ హాక్ అకాడమీ హాకథాన్ పోటీలలో ఆర్‌వీ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. ఆదివారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఆర్‌వీ కళాశాల విద్యార్థుల బృందానికి రూ.25వేల నగదు బహుమతిని అందించారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య, ఇండస్ట్రీ అడ్వైజర్ సురేశ్ నరసింహలు బహుమతిని ప్రదానం చేశారు. 38 కళాశాలలనుంచి 133మంది విద్యార్థులు పాల్గొన్నారు. కేరళ, జార్ఖండ్, ఢిల్లీ, కోల్కత్తా, మహారాష్ట్రలతోపాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మస్థలపై దుష్ప్రచారం సరికాదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్‌రామచంద్రగౌడ

శిడ్లఘట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధర్మసల పట్ల దుష్ప్రచారం సరికాదని చిక్కబళ్ళాపుర జిల్లా బీజేపీ అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బీజేపీ సేవాసౌధలో మీడియాతో మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామాలలో ఆలయాల జీర్ణోద్ధరణ, పేదలకు ఉచిత వివాహాలు, చెరువుల పునరుద్ధరణతోపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. సమాజానికి మంచిపనులు చేస్తున్న వ్యక్తికి చెడ్డపేరు తెచ్చేలా పుణ్యక్షేత్రానికి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ఎన్ఐఏను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు మురళి, సురేంద్రగౌడ, నారాయణస్వామి, కనకప్రసాద్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీ ఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఆర్డీటీ క్రికెట్ కోచ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివా రం క్రికెట్ పోటీ లు నిర్వహించారు. ఎ, బి జట్ల మధ్య ఎంతో ఉల్లాసంగా సాగిన ఈ పోటీల్లో మొదట బ్యాటింగ్ చేసిన బి - జట్టు 40 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి. 159 పరుగులు చేసింది. వీరిలో కెప్టెన్ తరుణ్ 98, సంతోష్ 29 పరుగులతో రాణించారు. ఎ జట్టు కేవలం 88 పరుగులకే ఆల్ అవుట్ అయింది. విజయం సాధించిన బి జట్టును కదిరి క్రికెట్ సంఘం సభ్యులు ముబారక్, యల్లప్ప, విజయ్ అభినందించారు.